ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 85 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం 27 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02




## ప్రపంచం చూపు విశాఖ వైపు

- ‘గూగుల్ మెగా డేటా సెంటర్’కు శంకుస్థాపన
- విశాఖలో గూగుల్ మెగా డేటా సెంటర్, ఏఐ హబ్
- ఈ నెల 28న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- గూగుల్ డేటా సెంటర్ రాకతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన విశాఖ
- ఒక గిగావాట్‌కుపైగా సామర్థ్యంతో మూడు చోట్ల డేటా సెంటర్లు ఏర్పాటు
- విశాఖకు రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలు
- గూగుల్‌తో పాటు దాని ఆధారంగా ఏర్పాటయ్యే



## యూఎస్ బేస్‌లకు భారీగా నష్టం

**మరమ్మతులకు బిలియన్ల ఖర్చు!**

వాషింగ్టన్: ఇరాన్ దాడుల వల్ల పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలకు, ఆయుధ వ్యవస్థలకు భారీ నష్టం జరిగినట్టు ప్రాథమిక నివేదికలు పేర్కొన్నాయి. అమెరికా ప్రభుత్వంలో పనిచేసే కొందరు విశ్వసనీయ అధికారుల కథనం ప్రకారం ఇప్పటివరకు బహిరంగ ప్రపంచానికి తెలిసిన దానికంటే నష్టం ఎక్కువగా ఉంటుందని వారు తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలకు మరమ్మతు చేయడానికి బిలియన్ల డాలర్లు అవసరమవుతాయని వెల్లడించారు. ఎన్‌బీసీ న్యూస్ కథనం ప్రకారం.. అమెరికా స్థావరాల్లో రన్‌వేలు, రాడార్ వ్యవస్థలు నాశనమయ్యాయి. అమెరికా నిఘా ఉన్నప్పటికీ ఇరాన్‌కు చెందిన పాత యుద్ధ విమానం అమెరికాలో ఒక వైమానిక స్థావరంపై దాడి చేయగలిగింది. ఇరాన్‌తో యుద్ధం చేయడానికి 200 బిలియన్ల నిధులు కావాలని గతంలో పెంటగాన్ ట్రంప్ సర్కార్‌ను కోరింది.

## ప్రజావాణి సేవలు క్షేత్రస్థాయికి విస్తరించాలి

**-సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**




**హైదరాబాద్ న్యూస్** తెలంగాణలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. 2023 డిసెంబర్ 8న సీఎం రేవంత్ రెడ్డిఈ ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రజావాణి అమలు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రజావాణిని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఆ తర్వాత మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**ప్రజావాణి సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలి :** రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ట్రంప్‌పై మళ్లీ హత్యాయత్నం!

- ★ వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కలకలం
- ★ ఆయుధాలతో చెక్‌పాయింట్‌పైకి దూసుకొచ్చిన నిందితుడు
- ★ వైట్‌హౌస్ కరస్పాండెంట్ల డిన్నర్‌లో దుండగుడి కాల్పులు
- ★ సురక్షితంగా బయటపడ్డ ట్రంప్, వాన్స్, ఇతరులు
- ★ నిందితుడిని అదుపులోకి తీసుకున్న భద్రతా బలగాలు
- ★ ట్రంప్‌పై హత్యాయత్నంకి ప్రయత్నించిన 31 ఏళ్ల కోల్ టామస్ అలెన్
- ★ కాల్పులతో కుంగిపోలేదు : ట్రంప్




- ★ ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు: మోదీ
- ★ ట్రంప్, అధికారులే లక్ష్యం : తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే
- ★ లోన్ వుల్ఫ్‌గా ట్రంప్ వ్యాఖ్య

## 100 మీటర్ల దూరంలో సువేందు ర్యాలీ

- ఆగ్రహంతో స్టేజీ దిగి వెళ్లిపోయిన మమతా బెనర్జీ
- పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో గందరగోళం
- 100 మీటర్ల దూరంలో సువేందు ర్యాలీ నిర్వహించడంతో దీదీ ఫైర్
- 100 మీటర్ల దూరంలో హోరాహోరీ..
- రణరంగంగా మారిన వీధులు..!
- “ఓటమి భయంతోనే దీదీ పరార్”: బీజేపీ
- ఏప్రిల్ 29న అసలైన పరీక్ష..



## గెలుపుపై ధీమా




- ♦ క్యాబినెట్ ప్రాబబుల్స్ జాబితా సిద్ధం చేసిన విజయ్!
- ♦ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయి పోలింగ్
- ♦ గెలుపుపై భారీ ఆశలు పెట్టుకున్న టీవీకే చీఫ్ నటుడు విజయ్
- ♦ మంత్రివర్గం కూర్పును సిద్ధంచేసినట్టు జోరుగా ప్రచారం
- ♦ విజయ్ పాపులారిటీ, అనూహ్యంగా పెరిగిన పోలింగ్
- ♦ ఫలితాలు వెల్లడికి మరో 8 రోజుల సమయం
- ♦ ఆశల పల్లకిలో డీఎంకే, అన్నాడీఎంకే, టీవీకేల అభ్యర్థులు
- ♦ పోలింగ్‌కు ముందు సర్వేల్లో అధికార డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ప్రధాన పోటీ

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో గెలుపుపై ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. ఫలితాలు వెల్లడికి మరో 8 రోజుల సమయం ఉండటంతో డీఎంకే, అన్నాడీఎంకే, టీవీకేల అభ్యర్థులు ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. పోలింగ్‌కు ముందు సర్వేల్లో ప్రధాన పోటీ అధికార డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ఉంటుందని, నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) మూడో స్థానంతోనే సరిపెట్టుకుంటుందని తేలింది.

# రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరా కొరతతో బంకుల మూసివేతపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. ముంబై నుంచి ఉదయం అమరావతికి బయలుదేరే ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా దాదాపు 421 బంకులు మూతపడ్డాయని తెలిపారు. సరఫరా గతం కంటే 10 శాతం పెరిగినా ప్యానిక్ కొనుగోళ్ల కారణంగా అనేక బంకుల్లో రద్దీ కనిపిస్తోందని అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9,048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయని వివరించారు. కొరత ఉందనే ఆందోళనతో కొనుగోళ్లు భారీగా పెరిగాయని అధికారులు తెలిపారు. శనివారం రోజు 10,345 కిలో లీటర్ల పెట్రోల్, 14,156 కిలో లీటర్ల డీజిల్ అమ్మకం జరిగినట్లు అధికారులు వివరించారు. సాధారణ అమ్మకం కంటే ఒక్కసారిగా 50 శాతం అమ్మకాలు పెరగడంతో బంకుల్లో నిల్వలు అయిపోతున్నాయని అధికారులు వివరించారు. ఆందోళన కొనుగోళ్ల కారణంగా సరఫరా పెరిగినా వినియోగదారులు అనేక చోట్ల బారులు తీరి కొనుగోళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆక్వా రంగంలో డ్రమ్‌లలో కొనుగోళ్లు జరుపుతారని వారికి పెట్రో ఉత్పత్తులు విక్రయించే విషయంలో సమస్య తలెత్తుతోందన్నారు. పరిష్కారం చూపేందుకు కలెక్టర్లు, ఫిషరీష్ శాఖ అధికారులు వెంటనే కార్యాచరణ అమలు చేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను అదేశించారు. ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలు, సమస్య పరిష్కారంపై సాయంత్రంలోగా తనకు నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను అదేశించారు.

**రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు :** రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ పరిస్థితిపై మంత్రి నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు." రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు. సరఫరాలో వచ్చిన చిన్నపాటి లోపాలు వల్లే బంకులు మూతపడుతున్నాయి. ఇంధనానికి ఎలాంటి లోటు లేదు, ఆందోళన అవసరం లేదు. సమాచార, ప్రసార మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు వివరాలు తెలపాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవాలి. పలు చోట్ల కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. చట్ట విరుద్ధంగా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠినంగా చర్యలు. వాహనదారుల్లో భయాందోళనలతో సరఫరా చైన్ దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆయిల్ డిపోల్లో జిల్లా అధికారులు నిత్య పరిశీలన చేయాలి. ప్రైవేటు ఆయిల్ కంపెనీల డిపోలు, అవుట్‌లెట్‌లనూ తనిఖీలు చేయాలి. భయాందోళనతో గొడవలు జరగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలి." అని మంత్రి నాదెండ్ల తలిపారు.

**బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు :** మరోవైపు రాష్ట్రంలోని పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత అధికమైంది. శుక్రవారం రాత్రి మొదలైన ఈ సమస్య శనివారం, నేడు(ఆదివారం) మరింత తీవ్రమైంది. చాలా మంది అవసరానికి మించి ఎక్కువ కొనుగోలు చేయడంతో నిల్వల తగ్గిపోతున్నాయి. పలుచోట్ల పెద్ద ప్లాస్టిక్ డబ్బాలు, డ్రమ్ముల్లో డీజిల్ కొని తీసుకెళ్తున్నారు. దీంతో బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. స్టాక్ ఉన్నచోట జనం బారులు తీరుతున్నారు. వరి కోత యంత్రాలు, ఆక్వా సాగులో ఏరియేటర్లకు డీజిల్ కావాలంటూ రైతులు బంకుల వద్ద క్యూ కడుతున్నారు.

# 100 మీటర్ల దూరంలో సువేందు ర్యాలీ

పశ్చిమ బెంగాల్ రెండో దశ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ.. రాష్ట్ర రాజకీయాలకు గుండెకాయ లాంటి భవనీపూర్ నియోజకవర్గంలో శనివారం హైడ్రామా చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రసంగిస్తున్న సభకు కేవలం 100 మీటర్ల దూరంలోనే బీజేపీ నేత సువేందు అధికారి ర్యాలీ నిర్వహించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ శ్రేణుల నినాదాలు, లౌడ్‌స్పీకర్ల హోరుతో అసహనానికి గురైన మమతా బెనర్జీ.. తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా ముగించి వేదిక దిగి వెళ్లిపోయారు.

**100 మీటర్ల దూరంలో హోరాహోరీ :** శనివారం సాయంత్రం భవనీపూర్‌లోని చక్రబేరియా రోడ్డు వద్ద తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) బహిరంగ సభ ఏర్పాటు చేసింది. మమతా బెనర్జీ ప్రసంగం మొదలైన కొద్ది సేపటికే.. సమీపంలోనే బీజేపీ కార్యకర్తలు భారీ శబ్దంతో ర్యాలీని ప్రారంభించారు. బీజేపీ లౌడ్‌స్పీకర్ల గోల వల్ల తన మాటలు ప్రజలకు వినబడటం లేదని, ఇది కావాలని చేస్తున్న కుట్ర అని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు. "నా గొంతును నొక్కేయాలని చూస్తున్నారు" అని వ్యాఖ్యానిస్తూ.. అక్కడికి వచ్చిన ప్రజలకు క్షమాపణలు చెప్పి ఆమె సభ నుంచి నిష్క్రమించారు.

**రణరంగంగా మారిన వీధులు :** మమతా బెనర్జీ వెళ్లిపోయిన వెంటనే భవనీపూర్ వీధులు రణరంగంగా మారాయి. సువేందు అధికారి సభ జరుగుతున్న ప్రాంతానికి టీఎంసీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. అటు బీజేపీ, ఇటు టీఎంసీ శ్రేణులు పరస్పరం నినాదాలు చేసుకుంటూ ఎదురు పడటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. భద్రతా బలగాలు సకాలంలో స్పందించి ఇరు వర్గాలను చెదరగొట్టడంతో పెను ప్రమాదం తప్పింది.

**"ఓటమి భయంతోనే దీదీ పరార్": బీజేపీ**

ఈ ఘటనపై బీజేపీ ఐటీ సెల్ ఇన్ ఛార్జ్ అమిత్ మాలవీయ స్పందిస్తూ.. మమతా బెనర్జీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే సహనం కోల్పోయి సభ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. మరోవైపు సువేందు అధికారి మాట్లాడుతూ.. బెంగాల్‌లో టీఎంసీ గూండాగిరి చేస్తోందని, త్వరలోనే వారికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని మండిపడ్డారు.

**ఏప్రిల్ 29న అసలైన పరీక్ష:** భవనీపూర్ మమతా బెనర్జీకి కంచుకోట. 2011 నుంచి ఆమె ఇక్కడ మూడు సార్లు విజయం సాధించారు. అయితే గతంలో నందిగ్రామ్‌లో తనను ఓడించిన సువేందు అధికారి ఇప్పుడు మమత ఇలాకాలోనే సవాల్ విసరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏప్రిల్ 23వ తేదీన 152 నియోజక వర్గాలకు ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఇక భవానీపూర్‌తో సహా 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4వ తేదీన ఫలితాలు వెల్లడి కానుండగా.. బెంగాల్ పీఠం ఎవరిదో తేలిపోనుంది.

# ప్రపంచం చూపు విశాఖ వైపు

**కంపెనీల్లో కలిపి లక్షా 88 వేల దాకా ఉద్యోగావకాశాలు వస్తాయని అంచనా**

- **డేటా సెంటర్ల నిర్మాణ సమయంలో నిర్మాణరంగ కార్మికులకు అందరికీ కలిపి సుమారు 60 వేల మందికి ఉపాధి అవకాశాలు**

ఏఐ, ఎంఐలపై పనిచేసే కంపెనీలకు కావాల్సిన నిపుణుల్ని తయారుచేసేందుకు విశాఖకు పెద్ద సంఖ్యలో విద్యాసంస్థలు ఉక్కు నగరం విశాఖ ఏఐ స్థావరంగా రూపాంతరం చెందే ఘడియలు సమీపిస్తున్నాయి. ఐటీ స్థావరాలుగా వెలుగొందుతున్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాల సరసన మన విశాఖను చేర్చే శుభ ముహూర్తం ఇంకొన్ని గంటల్లోనే సాకారం కానుంది. ప్రతిష్మాత్మక గూగుల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద, అత్యాధునిక మెగా డేటా సెంటర్, ఏఐ హబ్‌కు సీఎం చంద్రబాబు మరో రెండ్రోజుల్లో భూమి పూజ చేయనున్నారు. ఈ మెగా ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు ప్రపంచమంతా విశాఖ వైపు చూసేలా చేసింది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఈ సుందర సాగరతీర నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నాయి. ఐటీ, సెమీకండక్టర్ రంగాల్లో భారీగా పెట్టుబడులు రానున్నాయి. ఉపాధి అవకాశాల కల్పతరువుగా విశాఖ మారనుంది. ఐటీ దిగ్గజం గూగుల్ రూ.లక్షా 35 వేల కోట్లతో విశాఖలో ఏర్పాటు చేస్తున్న మెగా డేటా సెంటర్, ఏఐ హబ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 28న భూమి పూజ చేయనున్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటు చేసేది కేవలం డేటా సెంటర్ కాదు! అదో ఏఐ మెగా హబ్! ఇక్కడ డేటా సెంటర్‌తో పాటు వివిధ సంస్థలకు ఏఐ ఆధారిత కంప్యూటింగ్ సేవలు అందించే మౌలిక వసతులు, భారీ ఎత్తున డేటా స్టోరేజీ, అత్యంత వేగవంతమైన కమ్యూనికేషన్ సదుపాయాలు వంటివి ఏర్పాటవుతాయి. ఇది ఓ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు. సముద్ర గర్భంలో వేసే కేబుళ్లతో అభివద్ధి చేసే ఇంటర్నేషనల్ సబ్‌సీ గేట్‌వేతో వివిధ దేశాలతో అనుసంధానం ఏర్పడుతుంది. గూగుల్ క్లౌడ్ ఏఐకి సంబంధించి మొత్తం ఆసియాకే విశాఖ గేట్‌వేగా మారనుంది.

**ఒక గిగావాట్‌కుపైగా సామర్థ్యంతో :** విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో గూగుల్ సంస్థ ఒక గిగావాట్‌కుపైగా సామర్థ్యంతో మూడు చోట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం తర్లువాడతో 266.6 ఎకరాలు, అడవివరంలో 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద 174.80 ఎకరాలు కేటాయించింది. 2028 నాటికి ఈ మూడు డేటా సెంటర్లను పూర్తిచేయాలన్నది గూగుల్ లక్ష్యం. తొలిదశలో తర్లువాడలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్‌కు ఈ నెల 28న శంకుస్థాపన చేస్తున్నారు. వైజాగ్ మెగా డేటా పార్క్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టుకు అదానీ సంస్థ మౌలిక వసతుల భాగస్వామిగా ఉంది. గూగుల్ మెగా డేటా సెంటర్ ప్రకటనతో యావత్ ప్రపంచం దృష్టిని విశాఖ ఆకర్షించింది. డేటా సెంటర్‌తో విశాఖ రూపురేఖలు మారిపోతాయని స్వయంగా గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ 2025 అక్టోబర్‌లో అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఐటీ, టెక్నాలజీ రంగంలో విశాఖకు పెట్టుబడులు తరలిరావడానికి, ఆ ఎకోసిస్టమ్ ఏర్పడేందుకు, పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచేందుకు పటిష్ఠమైన దారులు పరచనుంది.

**విశాఖకు రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలు :** గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటన తర్వాత రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలు కూడా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. మరిన్ని ఐటీ ,ఏఐ, క్లౌడ్, సెమీకండక్టర్ కంపెనీలు విశాఖకు తరలివచ్చేందుకు గూగుల్ డేటా సెంటర్ దోహదం చేస్తుందన్నది నిపుణుల అభిప్రాయం. ఏఐ మోడల్ డెవలప్‌మెంట్‌కు కావాల్సిన కంప్యూటింగ్ అవసరాల కోసం అనేక స్టార్టప్‌లు, ఏఐ ల్యాబ్‌లు, రీసెర్చ్ సెంటర్లు, ఇంక్యుబేటర్లు, టెస్టింగ్ సెంటర్లు, = ఐ ల్యాబ్‌లు కూడా విశాఖలో ఏర్పాటవుతాయని వారు చెబుతున్న మాట. కేవలం డేటా సెంటర్‌తో వేలల్లో ఉద్యోగాలు రావు. కానీ విశాఖలో గూగుల్ ఏఐ సేవలు అందించే మెగా హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సెంటిస్ట్‌లు, ఏఐ, మెషీన్ లెర్నింగ్ నిపుణులతో పాటు, విద్యుత్ సరఫరా, కూలింగ్, నెట్‌వర్కింగ్ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన హార్డ్‌వేర్ నిపుణులూ పెద్ద సంఖ్యలో అవసరమవుతారు. డేటా సెంటర్‌కు సమీపంలో ఉంటే కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు ఏఐ ఆధారిత కంపెనీలన్నీ విశాఖకు తరలివస్తాయి. దానికి అవసరమైన ఏకోసిస్టమ్ ఏర్పాటవుతుంది.

**లక్షా 88 వేల ఉద్యోగావకాశాలు :** గూగుల్‌తో పాటు దాని ఆధారంగా ఏర్పాటయ్యే కంపెనీల్లో కలిపి లక్షా 88 వేల దాకా ఉద్యోగావకాశాలు వస్తాయని అంచనా. అటు డేటా సెంటర్ల నిర్మాణ సమయంలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ వంటి రంగాలకు చెందిన నిపుణులు, నిర్మాణరంగ కార్మికులకు అందరికీ కలిపి సుమారు 60 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌గేర్లు, కూలింగ్ సిస్టమ్‌లు, బిల్డింగ్ మెటీరియల్, యూపీఎస్‌లు, జనరేటర్లు వంటి బ్యాకప్ పవర్ సరఫరాదారులు, వర్కర్లకూ ఉపాధి లభిస్తుంది. వీటికి అవసరమైన పరికరాలు సరఫరా చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటవుతాయి. స్థిరాస్తి, నిర్మాణ, రవాణా, ఆతిథ్య రంగాలకూ ఊతం దక్కుతుంది. దేశ, విదేశాలకు చెందిన ఐటీ, సాఫ్ట్‌వేర్ నిపుణుల రాకపోకలతో ఎయిర్ కనెక్టివిటీ పెరుగుతుంది.

**పెద్ద సంఖ్యలో విద్యాసంస్థలు :** ఏఐ, ఎంఐలపై పనిచేసే కంపెనీలకు కావాల్సిన నిపుణుల్ని తయారుచేసేందుకు విశాఖ చుట్టుపక్కలకు విద్యాసంస్థలూ పెద్ద సంఖ్యలో వస్తాయి. ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలూ ఏఐ, ఎంఐ, డేటా ఇంజినీరింగ్‌లో ప్రత్యేక కోర్సులు ప్రారంభిస్తాయి. విశాఖలో డేటా పార్క్ శంకుస్థాపనకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో పాటు ఆ సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ నెల 27న ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు హాజరవుతున్న సీఎం చంద్రబాబు అదే రోజు సాయంత్రం గూగుల్ ప్రతినిధుల గౌరవార్థం విందు ఇస్తున్నారు. 28న జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 2019కి ముందే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో రూ.70 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ సంస్థ సిద్ధమైంది. 2019లో కాపులుప్పాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన కూడా జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం అదానీ గ్రూప్‌ని ముప్పుతిప్పలు పెట్టింది. ప్రాజెక్టును 30 వేల కోట్లకు కుదించేలా చేసింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ ఉదాసీనత వల్ల ఆ ప్రాజెక్టు కూడా ఆచరణ రూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్, అధికారులు చేసిన కృషి వల్ల వైఎస్సార్సీపీ హయాంలో దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ని కొద్ది కాలంలోనే పునరుద్ధరించింది. దీంతో ఏకంగా గూగుల్ విశాఖకు తరలివస్తోంది.

# గెలుపుపై ధీమా

ఒక్కో స్థానంలో 15- 20వేల వరకు ఓట్లు టీవీకే దక్కుతాయని బలంగా నమ్ముతున్నారు. ఇవే ప్రధాన పార్టీల గెలుపోటములను నిర్ణయిస్తాయనే అంచనాలు ఉన్నాయి. పలుచోట్ల ఫలితాలను టీవీకే తారుమారు చేస్తుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, గెలుపుపై విజయ్ ధీమాతో ఉన్నారని సమాచారం. రెండు రోజుల కిందట టీవీకే కార్యాలయంలో కీలక నేతలతో విజయ్ సమావేశమై పోలింగ్ సరళి, ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి? అనే తదితర అంశాలపై సమాలోచనలు చేశారు. ఈ భేటీలో టీవీకే ఎన్నికల ప్రధాన కార్యదర్శి అదవ్ అర్జున్ సహా ముఖ్యనేతలు బుస్సి ఆనంద్, సెంగోట్టైయన్ పాల్గొన్నారు. పోలింగ్ శాతం, టీవీకేకు అనుకూలించే అంశాలు, సవాళ్ల గురించి వారిని విజయ్ అడిగి తెలుసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకోవడంతోనే పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదయ్యిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న విజయ్.. టీవీకే విజయానికి ఇదే దోహదం చేస్తుందని ఆయన నమ్ముతున్నారని తెలిసింది. ఈ క్రమంలోనే అధికారంలో వస్తామనే ధీమాతో ఆయన క్యాబినెట్ ప్రాబబుల్స్ జాబితాను కూడా సిద్ధం చేశారనే ప్రచారం జరుగుతోంది. అలాగే, టీవీకే పార్టీ నాయకులు ఇంకో అడుగు ముందుకేసి తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించినట్టు పోస్టర్లు వేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. పెరంబూర్‌లో విజయ్‌కు 70వేలు, తిరుపోరూర్‌లో టీవీకే అభ్యర్థి విజయరాజ్‌కు 30వేలు భారీ మెజార్టీతో గెలిచినట్లు పోస్టర్లు వైరల్ చేస్తూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేయడం గమనార్హం. ఈ ఎన్నికల్లో విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి రెండు చోట్ల బరిలో దిగారు. ఇక, ఒంటరిగా పోటీచేసిన టీవీకే.. మొత్తం 234 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. కానీ, ఎడప్పాడిలో మాత్రం ఆ పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో అక్కడ స్వతంత్ర అభ్యర్థికి విజయ్ మద్దతు ప్రకటించారు. అయితే, ఈ ఊహాగానాలు నిజమవుతాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తమిళనాడులో రికార్డుస్థాయిలో 85 శాతానికిపైగా పోలింగ్ నమోదయ్యింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తడానికి విజయ్ నేతృత్వంలోని టీవీకే పోటీ చేయడం కారణమనే అభిప్రాయాలూ కూడా వ్యక్తం కావడం గమనార్హం.

# ట్రంప్‌పై మళ్లీ హత్యాయత్నం..!

పశ్చిమాసియా యుద్ధం వేళ అమెరికాలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై శనివారం మరో హత్యాయత్నం జరిగింది. శ్వేతసౌధం సమీపంలోని హిల్టన్ హోటల్‌లో జరిగిన వైట్ హౌస్ కరస్పాండెంట్ల వార్షిక డిన్నర్‌లో కాల్పులు చోటుచేసుకోవడం కలకలం సృష్టించింది. ఈ ఘటన నుంచి ట్రంప్, ఇతర అధికారులు సురక్షితంగా తప్పించుకున్నారు. గత రెండేండ్ల వ్యవధిలో ట్రంప్‌పై హత్యాయత్నం జరగడం ఇది మూడోసారి. స్థానిక కాలమానం ప్రకారం 8.34 పీఎంకు హోటల్‌లో డిన్నర్ సర్వ్ చేస్తుండగా బాల్‌రూమ్ బయట సాయుధుడైన ఒక దుండగుడు పలుసార్లు కాల్పులు జరిపాడు. ఆ సమయంలో ట్రంప్ వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీజియా జియాంగ్, మానసికవేత్త ఓజ్ పియర్ల్‌మన్‌తో సంభాషిస్తున్నారు. కాల్పులు జరగగానే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ అధికారులు, ఇతర రక్షణ సిబ్బంది ట్రంప్‌కు, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్, ఆయన సతీమణి ఉషా వ్యాన్స్‌లకు రక్షణగా నిలిచి బాల్‌రూమ్ నుంచి బయటకు తరలించారు. కాల్పులతో డిన్నర్‌లో ఉన్న పలువురు నేతలు, పాత్రికేయులు, సెలబ్రిటీలు టేబుళ్ల కింద భయంతో దాక్కున్నారు. కాగా, డిన్నర్‌ను 30 రోజుల లోపు రీ షెడ్యూల్ చేసినట్టు కాల్పుల ఘటన ముగిసిన తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు.

**నిందితుడి అరెస్ట్ :** కాల్పుల అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. కాల్పులు జరిపిన కాలిఫోర్నియాకు చెందిన నిందితుడిని తమ రక్షణ సిబ్బంది పట్టుకున్నారని తెలిపారు. ఒక భద్రతాధికారిపై కాల్పులు జరిపినప్పటికీ అతను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించడంతో ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు. కాగా, కాల్పులు జరిపిన నిందితుడు కాలిఫోర్నియాకు చెందిన 31 ఏండ్ల కోల్ థామస్ అలెన్‌గా గుర్తించారు. అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు ఉన్నత విద్యావంతుడిగా తేలింది. 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేశారు. ప్రస్తుతం టీచర్‌గా పనిచేస్తున్నట్టు లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో ఉన్నది. 2024లో బెస్ట్ టీచర్ ఆఫ్ ది మంత్‌గా కూడా ఎంపికయ్యాడు. కాగా, హోటల్ బయట రోడ్డుపై పలువురు నిరసనకారులు బారులుతీరి ట్రంప్ పరిపాలనకు, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

**కాల్పులతో కుంగిపోలేదు :** కాల్పుల ఘటన అధ్యక్షుడిగా తనపై ప్రభావం పడుతుందని, తాను ప్రమాదకరమైన ఉద్యోగంలో ఉన్నానని, కానీ తాను కుంగిపోలేదని ట్రంప్ అన్నారు. 'నేను దాని గురించి ఆలోచించకుండా ఉండటానికే ఇష్టపడతాను. ఇది ప్రమాదకరమైన జీవితం. అయినప్పటికీ నేను సాధారణ జీవితాన్ని గడుపుతున్నాను. దీనిని సాధ్యమైనంత ఉత్తమంగా నిర్వహిస్తున్నానని అనుకుంటున్నాను. భద్రతా సిబ్బంది గొప్పగా విధులు నిర్వహించారు' అని ఆయన ప్రశంసించారు.

**ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు: మోదీ**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ, ఉపాధ్యక్షుడు వాన్స్ క్షేమంగా ఉన్నారని తెలిసి ఊరట చెందానని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని, దానిని నిస్సందేహంగా ఖండించాలని అన్నారు. కాల్పుల ఘటన తీవ్రంగా కలవరపెట్టిందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ అన్నారు. హింస ఎంతమాత్రం మార్గం కాదని మెక్సికన్ అధ్యక్షుడు క్లాడియా షైన్‌బామ్ పేర్కొన్నారు. గత రెండేండ్లలో ట్రంప్ రెండు హత్యాయత్నాల నుంచి బయటపడ్డారు.

**ట్రంప్, అధికారులే లక్ష్యం:** అధ్యక్షుడు ట్రంప్, అధికారులే లక్ష్యంగా దుండగుడు కాల్పులకు తెగబడ్డట్టు కన్పిస్తున్నదని అమెరికా తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే ఆదివారం తెలిపారు. ఈ ఘటనకు ముందు నిందితుడు కోల్ థామస్ అలెన్ పలు నగరాల్లో సంచరించిన విషయాన్ని దర్యాప్తు సంస్థలు గుర్తించాయని చెప్పారు.

# ప్రజావాణి సేవలు క్షేత్రస్థాయికి విస్తరించాలి

ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజే 2023 డిసెంబర్ 8వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల అధ్వర్యంలో ప్రతి వారం ప్రజా వాణి నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం ఉదయం ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులను ఆదేశించారు.

**సమస్యల పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం :** ఇకపోతే త్వరలో రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు. ప్రజా వాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గోకివాడ గ్రామం ద్వారపు రెడ్డి వారి మెచ్యూర్ ఫంక్షన్ హాజరైన మాజీ ఏ మ్మెల్యే కరణం ధర్మశ్రీ



**రాంబిల్లి విజ్ఞాన పత్రిక రిపోర్టర్ కోటిని బాబు రావు** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గోకివాడ గ్రామం ద్వారపురెడ్డి ప్రకాష్ మరియు ద్వారపురెడ్డి రాంబాబు వారి కుమార్తెల మెచ్యూర్ ఫంక్షన్ కు ఎలమంచిలి నియోజకవర్గ వైస్సార్సిపి ఇంచార్జ్ మాజీ విప్ మాజీ ఎమ్మెల్యే శ్రీకరణశ్రీ ధర్మశ్రీ హాజరై పిల్లల అక్షింతలు వేసి ఆశ్వీరధించితిరి ఈ కార్యక్రమంలో ఎలమంచిలి జడ్పిటిసి సేనాపతి సంధ్యారాము రాంబిల్లి జెడ్పిటిసి ధూళి నాగరాజు గోకువాడ మాజీ సర్పంచ్ నీరుకొండ శారద వెంకట సూర్యనారాయణ ఉప్పులూరి కిరణ్ కుమార్ ద్వారపురెడ్డి గోవిందరావు సేనాపతి సూరిబాబు సిరసపల్లి రామారావు పందుల శ్రీనివాసరావు నీరుకొండ గోవిందరావు నందవరపు రాఘవ ఆయన వెంట హాజరయ్యారు

## సద్గురు రామ బ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



**విజ్ఞాన్ దినపత్రిక కొడంగల్ నియోజకవర్గం రిపోర్టర్:** బొంరాస్పేట్ మండలం గ్రామపంచాయతీ రేగడి మైలారం లో సద్గురు రామ బ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ తో చలివేంద్రం ఏర్పాటు చేశారు చలివేంద్రం ప్రారంభించిన ఈడిగీ సత్తయ్య గౌడ్ ఈడిగీ ముద్దమ్మ వేసవి కాలంలో ఎండ తీవ్రతకు అలమటించే బాటసారుల దాహార్తిని తీర్చడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా ఏర్పాటు చేసే మంచినీటి కేంద్రమే చలివేంద్రం. ఇవి సాధారణంగా రద్దీగా ఉండే కూడళ్ళు, రోడ్ల పక్కన ఉంటాయి. మట్టి కుండలలోని చల్లటి నీరు, కొన్నిచోట్ల మజ్జిగను ప్రసాదంగా ప్రారంభిస్తారు ఈ కార్యక్రమంలో తలారి మైపాల్ శేఖర్ గౌడ్ వెంకటేశం సార్ మహేష్ శీను చుట్టి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## సిఎమ్ఏ -క్యాట్ లో 10వ ర్యాంక్ విద్యార్థికి ఎంఎల్ఏ రూ 50,000/- లు ఆర్థిక సాయం



గూడూరు పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన జి. సాయి ప్రసూన సిఎమ్ఏ –క్యాట్ 2026 పరీక్షల్లో జాతీయ స్థాయిలో 10 వ ర్యాంక్ సాధించి గూడూరు డివిజన్ లో మొదటి స్థానాన్ని సంపాదించింది. అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, ప్రతాప్ ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న గూడూరు మీూా డా.శ్రీ పాశిశీ సునీల్ కుమార్ గారు విద్యార్థిని అభినందించి రూ 50,000/– ల ఆర్థిక సహాయం ను తూపిలి శ్రీనివాసులు ద్వారా అందించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కష్టపడి చదువుకునే పేద విద్యార్థులకు మీూా గారు అండగా ఉంటారని, ఆరోగ్యం బాగాలేని వారికి కూడా ఆర్థిక సహకారం అందిస్తుంటారని పేదల కష్టాలను గమనించి అన్నివిధాలా సహకరిస్తున్న సునీల్ కుమార్ గారికి అందరూ అండగా నిలవాలని కోరారు. ప్రసూన లాంటి విద్యార్థిని మీూా గారి కోరిక మేరకు బాగాచదివి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, తూపిలి శ్రీనివాసులు, అల్లూరు సారధి, చెంచు నారాయణ, తూపిలి ప్రకాశం, ప్రతాప్ , అల్లం సాయి, జయపాల్, చిల్లకూరు శ్రీనివాసులు, అడపాల రవికుమార్, చిల్లకూరు రవి, వెంకటరమణ, పురుషోత్తం,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర వసతిగృహము బిట్రగుంట నందు ఆత్మీయ సమ్మేళనం

**-విశ్రాంతి అధికారి భాషను ఘనంగా సన్మానించిన నిర్వాహకులు**



**కావలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** ప్రభుత్వబాలుర వసతిగృహం లో బిట్రగుంట ఆదివారంనందు, పూర్వవిద్యార్థుల వడ్డె సంపూర్ణ, జ్యోతి బాలంకులు ఆధ్వర్యంలో... 1988నుండి 1993సం లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలబిట్రగుంట నందు ఇతరప్రాంతములనుండి, బాల, బాలికలు విద్యను అభ్యసిస్తూ మరియు ప్రభుత్వ, ఎస్సీ , బిసి బాలుర బాలికల హాస్టళ్ళలో లలోప్రవేశం పోంది,ఒకరినొకరు సోదర,సహోదరిలుగఎంతో ఆత్మీయ, అనురాగములతో,గడిపిన మరువలేని, మరపురాని మధుర క్షణములను,గత స్మృతులను గుర్తుచేసుకోవాలనే మంచి ఆత్మీయ సంకల్పముతో,ప్రస్తుతం, అందుబాటులో ఉన్న విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారులు,4వ తరగతి సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులతో చఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేయడమైనది,పై కార్యక్రమంలో గత స్మృతులు, ప్రేమ, అభిమానం, గౌరవం, ఆత్మీయత, అనురాగములను, గుర్తు చేసుకొంటు,ఆనందోత్సవాలమధ్యన ముచ్చటించుకోవడం, గుర్తు చేసుకోవడం జరిగింది. విశ్రాంత బిసిహాస్టల్ వసతిగృహ సంక్షేమాధికారి ాఖ. బాష, రాష్ట్ర హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఈదూరువిజయ్ కుమార్ ప్రసంగిస్తు... ఆరోజుల్లో విద్యార్థిని, విద్యార్థులలో క్రమశిక్షణ, ఉపాధ్యాయులు, సంక్షేమాధికారులు,4వతరగతి సిబ్బందిలో.. ఒక బాధ్యత, సేవాభావం పుష్కలంగాఉండేవని విద్య తో వస్తుంది వివేకం.. వివేకం,తెస్తుంది సౌభాగ్యం అనె వినాదంతో 10వ తరగతిలోమంచి ఫలితాలు సాధించాలి అనె దృఢ సంకల్పం తో బాధ్యలు నిర్వహించేవారని,గత స్మృతులను గుర్తు చేసుకోవడం జరిగింది పై కార్యక్రమంలో... వసతిగృహ సంక్షేమాధికారి మొగిలి అనిత, సుగుణమ్మ, మరియు పూర్వ విద్యార్థులు, విద్యార్థినులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయడమైనది.

## కొండబిట్రగుంట ఆలయ ఈఓపై విచారణకు మంత్రి ఆనం ఆదేశం



**కావలి విజ్ఞాన పత్రిక** నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఇూా)పై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విచారణకు ఆదేశించారు. గత కొంతకాలంగా సదరు అధికారిపై భక్తుల నుంచి మరియు స్థానికుల నుంచి భారీస్థాయిలో అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు.

**అవినీతి ఆరోపణలు:** ఆలయ నిధుల దుర్వినియోగం, నిర్వహణలో లోపాలు మరియు భక్తుల పట్ల అనుచిత ప్రవర్తన వంటి అంశాలపై భక్తులు మంత్రికి ఫిర్యాదు చేశారు.

**మంత్రి స్పందన:** దేవాలయాల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించే ఏ అధికారిని ఉపేక్షించేది లేదని మంత్రి ఆనం స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సత్వర విచారణ: ఈ ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, త్వరితగతిన నివేదిక సమర్పించాలని దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

**భక్తుల హర్షం:** చారిత్రక నేపథ్యం ఉన్న కొండబిట్రగుంట ఆలయ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడం పట్ల స్థానిక భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ పాలనలో పారదర్శకత తీసుకురావాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## దర్శకుడు డా.పీసీ ఆదిత్య కు ఇండోనేషియా పురస్కారం

**-అభినందనలు తెలిపిన డా.పాదర్తి**




**కావలి, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** తెలుగు సినీరంగంలో గత30 సంవత్సరాలనుండి వలు ప్రయోగాలు చేస్తూ ఎంతో మంది నూతన కళాకారులకు అవకాశాలు ఇస్తున్న సినీ శ్రామికుడు, దర్శకుడు డా. పీసీ ఆదిత్యకు మరో అంతర్జాతీయ పురస్కారం దక్కింది... మన దేశానికి చెందిన గ్రీన్ ఇండియా పరివార్ తో కలిసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ఇండోనేషియా కు చెందిన ఎన్ జి ఐ పి ఫౌండేషన్ పీసీ ఆదిత్య సేవల్ని గుర్తించి “ఇండోనేషియా ఎక్సెన్స్” అవార్డ్ 2026ను బహుకరించినది. ఈ విషయం ఇండియా ప్రతినిధి “నీరజ్ గుప్తా” తెలియజేసారు. సామాజిక చైతన్యం కలిగించే చిత్రాలు రూపోందిస్తున్న పీసీ ఆదిత్య కు ఈ అవార్డు అందజేయడం గర్వంగా ఉందన్నారు... అవార్డు గ్రహీత ఆదిత్య స్పందిస్తూ మన దేశానికి మిత్ర దేశమైన నుండి ఈ అంతర్జాతీయ అవార్డు అందుకోవడం భారతీయుడిగా గర్వపడుతున్నాను అన్నారు... డా.పాదర్తి నాగరాజు మాట్లాడుతూ మా గురువు,పూజ్యులైన డా.చంద్ర ఆదిత్య కు ఈ అవార్డ్ రావడం చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా ఆయన కు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

## ప్రజాస్వామ్యానికి పాతరేసేలా దేశంలో మోడీ పాలన

**-భారతదేశాన్ని కించపరిచిన ట్రంప్ వ్యాఖ్యలను సమర్థిస్తున్న మోడీ ప్రభుత్వం ప్రశ్నించకపోవడం ఆంతర్యం..**

**-ప్రజా సమస్యలు గాలికివదిలేసిన సీఎం చంద్రబాబు**

**-ధ్వజమెత్తిన సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**



దేశంలో ప్రజాస్వామ్యానికే పాతరేసేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కే.రామకృష్ణ ధ్వజమెత్తారు. స్థానిక సంతపేట సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ వ్యామోహంతో మోడీ బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నేతలు, బిజెపిలో చేరారని తెలిపారు. మరి కొంతమంది నేతలు కూడా ఆ పార్టీ నుంచి బిజెపిలో చేరనున్నట్లు విమర్శలకు తావిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తే, అటువంటి వారిపై, అధికారుల చేత వివిధ కారణాల ఆరోపణలతో, బిజెపి ప్రభుత్వం దాడులు నిర్వహిస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. బిజెపి కండువా పుచ్చుకుంటే ఆ దాడులు ఉండవు, ఉన్న కేసులు మాయం అవుతాయని ఎద్దేవా చేశారు. ఇటువంటి పాలన విధానాలతో, బిజెపి పాలన సాగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గతంలో మన ఇండియా, పాకిస్థాన్ లకు యుద్ధం జరిగిందని గుర్తు చేశారు. ఆ యుద్ధాన్ని తానే మధ్యవర్తిగా మాట్లాడి ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే ప్రకటించాడని అన్నాడు. ఆ యుద్ధాన్ని ఆపింది తానేనని, సుమారు 62 సార్లు ట్రంప్ ప్రకటన చేశాడని అన్నారు. ఆ ప్రకటనపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ వివరణ ఇవ్వలేదన్నారు. ట్రంప్ పేరును ప్రస్తావించకపోగా, ఏమి మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. ట్రంప్ పేరును ప్రస్తావించేందుకు మోదీ భయపడ్డాడా అని ప్రశ్నించారు. ఇటీవల ఇరాన్ తో అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం కొనసాగిస్తుందని అన్నారు. ఆ దేశానికి ఏ దేశమైనా మద్దతు ఇచ్చిన, ఆ దేశంలో చమురు కొనుగోలు చేసిన ఆర్థిక ఆంక్షలు విధిస్తామని అమెరికా హెచ్చరించినట్లు తెలిపారు. అలాగే మన దేశ పౌరులను, మన దేశాన్ని కించపరిచేలా ట్రంప్ ప్రస్తావిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలపై మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో మోడీ అమర్థత ప్రధానమంత్రిగా పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. దేశ పౌరులను బానిసలుగా మోడీ చూస్తున్నాడా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆ యుద్ధం కారణంగా మనదేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఏర్పడిన విషయం తెలిసిందే అని అన్నారు. దేశంలో సుమారు 12 ఏళ్ల బిజెపి పాలనలో, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, పలువురు అధికారులు అవినీతి కార్యక్రమాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా దేశ ప్రతిష్టను కించపరిచే విధానాలను, అరికట్టే చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు, ప్రతిపక్ష నాయకులు ఓడించిందని గుర్తు చేశారు. మహిళా బిల్లు పేరుతో, డిలిమిటేషన్ బిల్లును బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని తెలిపారు. మహిళా బిల్లు గతంలోనే పాస్ చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రవేశ పెడుతున్నట్లుగా, డిలిమిటేషన్ బిల్లును జోడీగా ప్రవేశపెట్టి దాచిందని తెలిపారు. దాంతో ప్రతిపక్ష నాయకులు ఆ బిల్లును ఓడించే విధముగా, ఓట్లతో తిరస్కరించారని అన్నారు. ఆ డిలిమిటేషన్ బిల్లులో, 2011 జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లుపొందుపరిచినట్లు తెలిపారు డిలిమిటేషన్ బిల్లుఆధారంగా,భవిష్యత్తులో దక్షణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లోతోందని తెలిపారు. ఇటువంటి స్వార్థ రాజకీయాలతోబిజెపిప్రభుత్వం పాలనసాగిస్తుందనివిమర్శించారు. ప్రజలు బిజెపి ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా, పక్కదోవ పట్టించేలా పాలనా విధానాలు అవలంబిస్తుందని విమర్శించారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు సమస్యలతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులకు పెట్టిన పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికై చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి అరిగెలసాయి తదితరులు పాల్గొన్నారు.

## అస్థిత్వం

మనిషి అస్థిత్వానికి మూలాలైన
నైతిక, ఆధ్యాత్మిక విలువలు
ద్వారా మానవ జీవితమనేది
ఒక గౌరవాన్ని, ఒక అర్థాన్ని
సంతరించుకుంటుంది
నైతిక, ఆధ్యాత్మిక విలువలు లేనిదే
మిగిలిన విలువలన్నీ కూడా
అర్ధరహితం గాను
ప్రయోజన శూన్యంగా తయారవుతాయ్
విలువలు లేకపోతే
మనిషి యొక్క జీవితానికి
ఒక దిశ గమ్యం లేకుండా పోతుంది
ఆధ్యాత్మికపరమైన జీవితంపై
అవగాహన కలిగి ఉండాలి
భారతీయ సంప్రదాయంలో
ఇది ఒక ప్రత్యేక మైన అంశంగా
వేదాంతం స్పష్టం చేసింది
వేదాంతం అనేది భౌతిక రసాయన
శాస్త్రాలవలె అది ఒక శాస్త్రమే
ఇది మనిషి నిజ స్వరూపాన్ని
తెలుసుకునేందుకు సహకరించే
శాస్త్రం.



**రచన: కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## క్యాన్సర్ పేషెంట్ కి ఆర్థిక సహాయం అందించిన సలాం



కందుకూరు పట్టణంలో నివాసం ఉండే మీరా సాహెబ్ అనే వ్యక్తి కొద్ది కాలంగ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈమధ్య కొద్దిగా అనారోగ్యం ఎక్కువ అవడం వల్ల చికిత్స కోసం ఆర్థిక పరమైన కారణంగా ఐఎఫ్సి ఫౌండేషన్ వారిని సంప్రదించాడు. కందుకూరు పట్టణంలో మొబైల్ రంగంలో, సేవా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న స్నేహశీలి,మృదుస్వభావి సలాం భాయ్ గారు (స్టూడెంట్స్ మొబైల్ అధినేత) విషయం తెలుసుకొని 5000/– ఆర్థిక సహాయం ఫౌండేషన్ సెక్రటరీ షంషేర్ కి అందచేసి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎవరికైన కష్టం ఉంది అని తెలియగానే తన వంతుగా వారి వివరాలు తెలుసుకొని,వెంటనే స్పందించే సలాం గారు మాట్లాడుతూ ఆర్థిక పరంగా కష్టాల్లో ఉన్నా వారికి తన వంతుగా,మానవతా సేవా దృక్పథంతో తోచినంత సహాయం అందించడం తనకి ఎంతో ఆత్మ తృప్తి ని ఇస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు పాల్గొని సలాం గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పేద పిల్లలకు ఉచిత ఖత్నా (ఒడుగులు) కార్యక్రమం



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు గ్రామంలోని మదీనా మజీద్ లోని ఆదివారం నాడు పేద పిల్లలకు ఉచిత ఖత్నా (ఒడుగులు) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది పిల్లలు పైగా పాల్గొని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఇదేవిధంగా ప్రతి సంవత్సరం పేద పిల్లలకు ఖత్నా (ఒడుగులు ) కార్యక్రమం నిర్వహిస్తాము అని తెలిపారు. పేద పిల్లల ఖత్నా (ఒడుగులు) కార్యక్రమం కోసం ప్రతి ఒక్క ముస్లిం సోదరులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జలీల్, రహమత్ అలీ, చాన్ భాష,హారున్,బషీర్,జలిల్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభావంతులైన జర్నలిస్టులకు పురస్కారాలు



**విజయవాడ,ఏప్రిల్ 26:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభావంతులైన జర్నలిస్టులకు పురస్కారాలు అందించేందుకు తెలుగు జర్నలిస్ట్ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం విజయవాడలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు మాట్లాడుతూ మే నెలల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రభావంతులైన జర్నలిస్టుల వివిధ విభాగాలలో హైదరాబాద్ వేదికగా ముఖ్య అతిథి గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక గజపతి రాజు చే పురస్కారాలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశం లో గౌరవ అధ్యక్షులు తిలక్ ,సుబ్బారావు, శ్రీనివాసులు, ప్రతీప్ కుమార్ రెడ్డి, విజయ్ భాస్కర్, సీతారామరాజు, హనుమంత ఆచారి, సాంబశివరావు, రాజేష్, శివశంకర్, రాజేష్, కృష్ణారావు, శ్రీను నాయక్, ప్రవీణ్ కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# డా॥ కిషోర్స్ రత్నం పాఠశాలలో అంగరంగ వైభవంగా అష్టమ (8వ) సంస్కృతి వార్షికోత్సవం వేడుకలు









డా॥ కిషోర్స్ రత్నం పాఠశాలలో అష్టమ (8వ)సంస్కృతి మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. అత్యంత సంప్రదాయ విధానములో చక్కగా జరిగింది. చిన్నారులు వివిధ భారతీయ సాంప్రదాయ వేషధారణలో కలశము, నటరాజ ప్రతిమతో మంత్ర పుష్పఉచ్చారణతో సభను అలంకరించారు. అష్టమ సంస్కృతి వార్షికోత్సవంలో 74 నృత్యాలతో విద్యార్థిని విద్యార్థులు ప్రేక్షకులను కనువిందు చేశారు. సంస్కృతి కార్యక్రమాన్ని డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు ,ప్రధానాధ్యపకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. భారతదేశంలోని వివిధ నాట్యరీతులైన భరతనాట్యం, కూచిపూడి, మోహినీయాట్టం మొదలైన నృత్యాలతో మన భారతీయ సంస్కృతికళలు, సాంప్రదాయలు ఉట్టిపడేలా విద్యార్థులు నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమమునకు సరస్వతినగర్ ప్లానింగ్ అండ్ మేనేజ్మెంట్ క్లబ్ విద్యార్థులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా॥ కృష్ణకిషోర్ , వాసంతి మన దేశ సనాతన ధర్మమునకు, సంస్కృతి సాంప్రదాయాలకు గొప్ప విలువ ను ఇస్తారని, ప్రతి సంవత్సరం "సంస్కృతి" కార్యక్రమముద్వారా విద్యార్థులను భారతీయ నాట్యరీతుల పట్ల ప్రోత్సాహాన్ని, గౌరవాన్ని కలుగజేస్తున్నారని తెలియజేశారు. సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన విద్యార్థులందరిని శాలువతో సత్కరించి ప్రశంశా పత్రాన్ని బహుకరించారు. చిన్నారులు చక్కటి శ్రుతి, లయలతో హావభావాలతో అద్భుతమైన నృత్య ప్రదర్శనలు గావించారు. ఈ కార్యక్రమాన్ని డా॥కిషోర్స్ రత్నం హైస్కూల్ సరస్వతి నగర్ ప్లానింగ్ అండ్ మేనేజ్ మెంట్ క్లబ్ విద్యార్థులు చక్కటి ప్రణాళికతో నిర్వహించారు. తరాలు ఎన్నిమారిన, మన భారతీయసాహిత్యము, సంస్కృతి నాట్యము, సంగీతము అజరామరమని ప్రపంచంలో ఒక గొప్ప స్థాయిని అవి కలిగి ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ. తుహీనా,వాణి, సునీల్, ఖాసింగార్లు, మేనేజర్లు రాజేష్, అజయ్ సింగ్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్‌లో ఘనంగా 'పార్కిన్సన్స్ వ్యాధి' అవగాహన సదస్సు

నెల్లూరు: ఏప్రిల్ 'పార్కిన్సన్స్ వ్యాధి అవగాహన మాసం' సందర్భంగా నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్స్ మరియు సిప్లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సు శనివారం విజయవంతంగా ముగిసింది. చమేజ్ ( మూవ్మెంట్ ఆఫ్ జాయ్) అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ దీక్షాంతి నారాయణ (ఎండీ, డీఎం చీవబతీశీశ్రీశీస్త్రఎ) మాట్లాడుతూ, పార్కిన్సన్స్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ముందస్తు గుర్తింపు: వణుకు (టెర్రీ), నడకలో అస్థిరత, శరీర కండరాలు బిగుసుకుపోవడం వంటి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని డాక్టర్ వివరించారు. జీవనశైలి మార్పులు: మందులతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం, ఫిజియోథెరపీ మరియు పోషకాహారం తీసుకోవడం ద్వారా పార్కిన్సన్స్ రోగులు సాధారణ జీవితాన్ని గడపవచ్చని సూచించారు. మానసిక ధైర్యం: వ్యాధి సోకిన వారిలో కుంగుబాటు ( డిప్రెషన్) కలగకుండా కుటుంబ సభ్యుల మద్దతు చాలా అవసరమని డాక్టర్ దీక్షాంతి నారాయణ నొక్కి చెప్పారు. ఈ




కార్యక్రమంలో భాగంగా రోగుల కోసం కొన్ని ప్రత్యేక వ్యాయామాలు మరియు 'మూవ్‌మెంట్ ఆఫ్ జాయ్') ( లో భాగంగా వినోదాత్మక కృత్యాలను నిర్వహించారు. అనంతరం రోగులు అడిగిన సందేహాలకు డాక్టర్ న్యూరో సర్జన్ ఉదయ్ నివృత్తి చేశారు. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు క్లస్టర్ హెడ్ జి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్కిన్సన్స్ బాధితుల కోసం ప్రత్యేక సౌకర్యాలు మరియు నిపుణులైన వైద్య బృందం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెషేంట్స్ హాస్పిటల్ డాక్టర్స్ , హాస్పిటల్ సిబ్బంది మరియు సిప్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**-అపోహలు నమ్మొద్దు: జేసీ వెంకటేశ్వర్లు**

**నెల్లూరు, ఏప్రిల్ 26:** జిల్లాలో ఎక్కడా కూడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని, అసత్య ప్రచారాలను నమ్మి వాహనదారులు ఆందోళన చెందవద్దని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో, జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న అపోహలపై డీఎస్ఓ లీలారాణితో కలిసి జాయింట్ కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 243 పెట్రోల్ పంపుల్లో సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎక్కడా కొరత లేకుండా నిరంతర సరఫరా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఇంధన సరఫరా సక్రమంగా కొనసాగుతున్నప్పటికీ, కొరత ఉందనే అపోహల కారణంగా కొన్ని పెట్రోల్ బంకుల్లో రద్దీ కనిపిస్తున్నదని పేర్కొన్నారు. వినియోగదారులు అవసరమైన మేరకు మాత్రమే పెట్రోల్, డీజిల్ తీసుకోవాలని సూచించారు. క్యాన్‌లు, బాటిల్స్‌లో పెట్రోల్, డీజిల్ నింపడం నిషేధించబడినదని, అటువంటి చర్యలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు. వ్యవసాయం, ఆక్వా రంగాలకు అవసరమైన డీజిల్ సరఫరా నిరంతరంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



జిల్లాలోని ప్రతి రీఫిల్లింగ్ స్టేషన్‌ను పర్యవేక్షించేందుకు తహసీల్దార్లు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లను నియమించి నిల్వల పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ కంపెనీలు అప్పు ప్రాతిపదికన సరఫరా చేయని కారణంగా జిల్లాలోని 15 పెట్రోల్ బంకుల్లో మాత్రమే తాత్కాలికంగా ఇంధనం అందుబాటులో లేదని, మిగిలిన అన్ని బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఏ పెట్రోల్ బంక్ యాజమాన్యం నో-స్టాక్ బోర్డులు పెట్టినా లేదా కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని జేసీ హెచ్చరించారు. వినియోగదారులు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా 9492273897 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఙూా లీలారాణి, ఏఎస్ఓ లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# ఎంపీ విపిఆర్ కు సాగర్ మిత్రల ధన్యవాదాలు

**- సాగర్‌మిత్ర సమస్యలపై కేంద్రం స్పందన**
**- మరో ఆరు నెలలు పీఎంఎంఎస్‌వై సేవలను కొనసాగిస్తూ నిర్ణయం**
**- ఇందుకు సంపూర్ణ సహకారం అందించిన ఎంపీకి ధన్యవాదాలు**
**- కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



సాగర్ మిత్ర సమస్యలను కేంద్ర మంత్రి స్థాయిలో వివరించి మరో ఆరు నెలలు ప్రధాన్‌మంత్రి మత్స్య సంపద యోజన సేవలను పొడిగించడంపై సాగర్‌మిత్రలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ని ఆదివారం తన కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కి తాము రుణపడి ఉంటామని ఏపీ సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు సభ్యులు స్పష్టం చేశారు. తక్కువ జీతానికి పనిచేసే తమ సమస్యను ప్రస్తావించి సేవలను పొడిగింపు చేసేలా కృషి చేయడం సంతోషమన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఫిబ్రవరి 11న కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ని ఢిల్లీలో కలిసి పీఎంఎంఎస్‌వై( ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన) ఫేజ్-× కింద నియమించబడిన సాగర్ మిత్ర సేవలు 31.03. 2026న ముగియనున్నాయని, వారి సేవలను పొడిగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాగర్ మిత్రలు స్థానిక మత్స్యకారులకు వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడం, తీరప్రాంత మత్స్యకార వర్గాల మధ్య కీలకమైన అనుసంధానంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రధాన్‌మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని 2026 సెప్టెంబర్ వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో ఈ పథకం కింద ఉన్న సాగర్ మిత్రలు హర్షం వ్యక్తం చేశారు. సేవల కొనసాగింపు చేయడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఆవుల వాసు, ఏపీ సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సభ్యులు స్వప్న, లక్ష్మీ, మొబీన, మోహన్ తదితరులు ఉన్నారు.

# ప్రజలకు ఉత్తమ కంటి వైద్య సేవలు అందించాలి

**- డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**
**- అధునాతన సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు**
**- ప్రపంచవ్యాప్తంగా 292 హాస్పిటల్స్, క్లినిక్స్**




ప్రతిష్టాత్మక సంస్థ డాక్టర్ అగర్వాల్స్ కంటి వైద్యశాల ప్రజలకు ఉత్తమ కంటి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నెల్లూరులోని వనంతోపు సెంటర్‌లో నూతన భవనంలో ఏర్పాటు అయిన డాక్టర్ అగర్వాల్స్ కంటి వైద్య శాలను వారు ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రికి చేరుకున్న విపిఆర్ దంపతులకు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ శివ ప్రతాప్‌రెడ్డి, కుమారులు శివ ప్రదీప్ రెడ్డి తదితరులు ఆహ్వానం పలికారు. అనంతరం ఆసుపత్రిలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆసుపత్రిలో ఉన్న నూతన ఎక్విప్‌మెంట్స్, ఆపరేషన్ థియేటర్, ఇతర సదుపాయాలను పరిశీలించారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో కూడిన డాక్టర్.అగర్వాల్ ఆసుపత్రిని నూతన భవనంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో 292 ఆసుపత్రులను ఏర్పాటు చేసి కంటి వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో 25 ఆసుపత్రుల ద్వారా పేదలకు వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. నెల్లూరులో 2016లో డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ఏర్పాటు అయిందని, పదేళ్ల తర్వాత ఇప్పుడు మరో భవనంలోకి మార్పు చేశారన్నారు. చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే మెరుగైన కంటి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పేద ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డా.శివ ప్రతాప్‌రెడ్డికి, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... ఈ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కూడా అమలులో ఉందని, తప్పకుండా ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, టిడిపి నాయకులు బెజవాడ వంశీరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.